క్లుప్తంగా

అందుబాటులో సబ్సిడీ యంత్రాలు

ధర్మసాగర్ : వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందించనున్నట్లు ఏఓ రాజేశ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్ గరిష్ట సబ్సిడీ రూ.1,000 ,పవర్ స్ప్రేయర్ గరిష్ట సబ్సిడీ రూ.10,000, రోటవేటర్ గరిష్ట సబ్సిడీ రూ.50,000,సీడ్‌కమ్ ఫెర్టిలైజర్ డ్రిల్ గరిష్ట సబ్సిడీ రూ.30,000, కల్టివేటర్లు గరిష్ట సబ్సిడీ రూ.20,000, పవర్ వీడర్ గరిష్ట సబ్సిడీ రూ.15,000, బ్రష్ కట్టర్ గరిష్ట సబ్సిడీ రూ.35,000, పవర్ టిల్లర్ గరిష్ట సబ్సిడీ రూ.1,00,000, స్ట్రాబేలర్స్ గరిష్ట సబ్సిడీ రూ.2,00,000కు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు దరఖాస్తుతో పాటు పట్టాపాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, కుల ధ్రువీకరణ పత్రంతో వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఎల్కతుర్తి : యాంత్రీకరణ పథకం ద్వారా 2025–26 సంవత్సరానికి భీమదేవరపల్లి మండలానికి సబ్సిడీ యంత్రాలు అందించనున్నట్లు ఏఓ పద్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోటవేటర్స్ 7, చేతిపంపులు 143, తైవాన్ పంపులు 29, కల్టివేటర్లు 10, సీడ్ కం ఫెర్టిలైజర్ డ్రిల్ 1, పవర్ ఫీడర్ 1, బ్రష్ కట్టర్ 2, పవర్ టిల్లర్ 1, గడ్డికట్టలు చుట్టే యంత్రాలు 2 కేటాయించినట్లు పేర్కొన్నారు. యంత్రాలు పొందేందుకు రైతులు పట్టాపాస్‌బుక్, ఆధార్ కార్డు, దరఖాస్తు ఫారం, రోటవేటర్‌కు దరఖాస్తు చేసుకున్నట్‌లెతై ట్రాక్టర్ ఆర్‌సీ, కంపెనీ కొటేషన్‌తో సంబంధిత ఏఈఓను సంప్రదించాలని సూచించారు. ఎల్కతుర్తి మండలానికి వివిధ వ్యవసాయ యంత్రాలు కేటాయించినట్లు ఏఓ రాజ్‌కుమార్ తెలిపారు. రోటవేటర్లు, చేతిపంపులు, తైవాన్ పంపులు, కల్టివేటర్లు, సీడ్‌కం ఫెర్టిలైజర్ డ్రిల్, పవర్ ఫీడర్, బ్రష్ కట్టర్లు, పవర్ టిల్లర్, గడ్డికట్టలు చుట్టే యంత్రాలు సబ్సిడీపై కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్, దరఖాస్తు ఫారం, పాస్‌ఫొటోతో వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

దాడికి పాల్పడిన నిందితుల రిమాండ్

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన చందా సుధాకర్‌పై దాడిచేసిన నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు శాయంపేట సీఐ రంజిత్ రావు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. నేరేడుపల్లి గ్రామానికి చెందిన చందా సుధాకర్‌పై పాత కక్షలతో అదే గ్రామానికి చెందిన చందా ప్రశాంత్, విజయ, ఆకుతోట జ్యోతి, పూర్ణచందర్, చింతపట్ల రాజు, కిట్టు దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో సుధాకర్ తలపై బలమైన గాయమైనట్లు తెలిపారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని వెల్లడించారు. ఈ క్రమంలో బుధవారం ప్రగతిసింగారం గ్రామంలో వాహనాల తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి ప్రశాంత్, విజయ, జ్యోతి, పూర్ణచందర్, రాజు, కిట్టు పారిపోయే ప్రయత్నం చేయగా అదుపులో తీసుకున్న ఎస్సై పరమేశ్.. పరకాల కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య


రోజా(ఫైల్)

ఐనవోలు : ఉరేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బొల్లెపల్లి లక్ష్మి–కుమారస్వామి దంపతుల చిన్న కుమార్తె బొల్లెపల్లి రోజ (23) గుడి ఏరియాలోని అద్దె ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీస్‌లు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. యువతి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

జంక్షన్ల వద్ద బారికేడ్ల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

పరకాల : రోడ్డు వెడల్పు, ప్రణాళిక లేకుండా నిర్మించిన జంక్షన్లు ప్రమాదకరంగా మారడంతో సాక్షి దినపత్రికలో ఈనెల6న 'డేంజర్స్ జంక్షన్' కథనం ప్రచురితమైంది. దీంతో పరకాల పోలీసులు స్పందించారు. హుజూరాబాద్, మొగుళ్లపల్లి నుంచి వచ్చే వాహనాలకు పరకాల నుంచి వెళ్లే వాహనాలు ఎదురుగా వెళ్లకుండా జంక్షన్ అవతలి నుంచి యూటర్న్ తీసుకునేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే శాశ్వత పరిష్కారం చూపించాలని వాహనదారులు కోరుతున్నారు.

సీపీఆర్‌పై అవగాహన

ఎల్కతుర్తి / ఆత్మకూరు : భీమదేవరపల్లి మండలం వంగర గురుకుల పాఠశాలలో ప్రభుత్వ వైద్యాధికారి రుబీనా, ఆత్మకూరు మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో మండల వైద్యాధికారిణి స్పందన బుధవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు సీపీఆర్ పద్ధతిపై శిక్షణ కల్పించారు.

పత్తి రైతులకు వర్షం దెబ్బ


నల్లబడిన పత్తిని ఏరుతున్న కూలీలు


తడిసి ముురిగిపోయి రాలిన పత్తి కాయలు

- నల్లబడిన పత్తి
- పెట్టుబడి ఖర్చు వచ్చేలా లేదని ఆవేదన
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు
- మండలంలో 4,300 ఎకరాల్లో పత్తి సాగు

కమలాపూర్ : ఆరుగాలం శ్రమించి, యూరియా కష్టాలను అధిగమించి పంటలు సాగు చేస్తే పంట చేతికొచ్చే దశలో కురసిన భారీ వర్షాలు పత్తి రైతులను నష్టాల్లోకి నెట్టాయి. పెట్టుబడి సంగతి దేవుడెరుగు.. కనీసం పత్తి ఏరిన కూలీ ఖర్చులు కూడా గిట్టుబాటు కాని పరిస్థితి నెలకొందని రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పత్తి పంటలు పూర్తిగా దెబ్బతినడంతో ఆశలు అడియాశలై కన్నీళ్లే మిగిలాయని రైతులు వాపోతున్నారు.

కూలీల ఖర్చులు రాని దుస్థితి..

మండల వ్యాప్తంగా ఈ వానాకాలం సీజన్‌లో 4,300 ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. ఒక్కో ఎకరానికి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టారు. తీరా పంట చేతికొచ్చే దశలో తుఫాన్ కారణంగా కురిసిన అకాల వర్షాలకు పత్తి పంటంతా తడిసిపోయి నల్లబడగా, కాయలన్నీ ముురిగిపోయాయి. దీంతో తడిసిన పత్తిని కూలిలతో తీయిస్తే కూలీ ఖర్చులు కూడా రాలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండోసారి క్రాప్ కూడా వస్తుందో రాదో తెలియని పరిస్థితుల్లో రైతులు దిగాలు చెందుతున్నారు. పంట నష్టపోయిన తమకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని పత్తి రైతులు కోరుతున్నారు.


నల్లబడిన పత్తిని చూపుతున్న రైతు రాజయ్య


తడిసి నల్లబడిన పత్తి

కూలి ఖర్చు మీదపడేలా ఉంది



ఈ సారి ఎకరంన్నరలో వరి సాగు చేసి ఇంకో రెండెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాను. ఎకరానికి రూ.30 వేల చొప్పున పెట్టుబడి పెట్టాను. కానీ అకాల వర్షాలకు కురవడంతో పత్తి పంటంతా తడిసి నల్లబడగా, కాయలన్నీ తడిసి ముురిగిపోయాయి. పత్తి ఏరియ్యడానికి రూ.10 వేల దాక కూలీ ఖర్చులు అయ్యాయి. తడిసి, నల్లబడిన పత్తిని అమ్మితే కూలీల ఖర్చులు కూడా వచ్చేటట్లు లేదు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– అల్లం రవి, రైతు, కమలాపూర్

ప్రభుత్వమే ఆదుకోవాలి



నాకున్న ఎకరంన్నర భూమిలో పత్తి పంట సాగు చేశాను. పంట మంచిగ ఎదిగిందని, దిగుబడి బాగానే వస్తుందని సంబరపడ్డాం. పత్తి ఏరుదామని అనుకునేలోగానే భారీ వర్షాలు కురిశాయి. దీంతో పత్తి అంతా తడిసి ముద్దయి నల్లబడింది. పత్తి ఏరేటందుకు కూలీల ఖర్చే రూ.15 వేలు అయ్యింది. పత్తి మొత్తం అమ్మితే రూ.6,500 వేలు కూడా వచ్చే పరిస్థితి లేదు. వ్యవసాయం చేయడం మానుకోవాలనిపిస్తుంది. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– రాంశెట్టి రాజయ్య, రైతు, కమలాపూర్

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

- డాక్టర్ పల్లెపాడు దామోదర్


మాట్లాడుతున్న దామోదర్

ఆత్మకూరు : చట్టాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకే ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సర్వోదయ యూత్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు లింగాధారిత హింస, మహిళల చట్టాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు సర్వోదయ సేవలు కృషిచేస్తున్నట్లు చెప్పారు. మహిళల హక్కులు, చట్టాలపై సీనియర్ న్యాయవాది టింగిలికారి సత్యనారాయణ అవగాహన కల్పించారు. కార్యకమంలో సీడీపీఓ స్వాతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, ఉమాదేవి, మంజుల, రోజారాణి, నస్రీమా, శ్రీదేవి, పుణ్యవతి, ఇందిర, సర్వోదయ కోఆర్డినేటర్ చాపర్తి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి బలోపేతానికి ఎస్‌హెచ్‌జీ దోహదం

దామెర : మహిళా శక్తి బలోపేతానికి స్వయం సహాయక సంఘాలు (ఎస్‌ఎచ్‌జీ) దోహదపడతాయని డీఆర్డీఏ డీపీఎం (ఐబీ) దయాకర్ అన్నారు. తెలంగాణ సెర్ప్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్ సిబ్బందికి ఫీల్డ్ ఇమ్మర్షన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇళ్ల సందర్శన, సంఘాలతో సమావేశం నిర్వహించి గ్రూపు కొనసాగే విధానం, ఎస్‌ఎచ్‌జీ గ్రూపులతో ఆర్థిక అవసరాలు ఎలా తీరుతున్నాయో సభ్యులు వివరించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ.. 18 మందితో కూడిన బృందం ఈనెల 17వ తేదీ వరకు ఫీల్డ్ ఇమ్మర్షన్ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సెర్ప్ సంస్థాగత వ్యవస్థ, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు తెలుసుకోనున్నట్లు పేర్కొన్నారు. జీవనోపాధి పథకాలు వంటి అంశాలను లోతుగా అధ్యయనం చేస్తామన్నారు. ఏపీఎం అశోక్, సీసీలు మాధవి, నగేష్, శంకర్, సుధీష్ణ, వీఓఏలు అరుణ, కవిత, శ్యామల, భవాని, గాయత్రి మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీఐ శక్తివంతమైన ఆయుధం


సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న రాజయ్య

కమలాపూర్ : సమాచార హక్కు చట్టం పౌరులకు శక్తివంతమైన ఆయుధమని, ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, బాధ్యత, సమర్థత పెంచడంలో ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ బెల్లి రాజయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సమాచార హక్కు చట్టం–2005పై అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ హక్కులను తెలుసుకుని సమాజంలో చైతన్యం కలిగించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రిన్సిపాల్ మాధవి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు సమాచారాన్ని తెలుసుకునే హక్కు కలిగి ఉండాలని, ఆ అవగాహన విద్యార్థుల నుంచే మొదలు కావాలన్నారు. సమాచార హక్కుచట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని, గ్రామాల్లో సైతం ప్రజలను చైతన్య పర్చాలని అన్నారు. యువకులు, విద్యార్థులు అవగాహన కల్పించేందుకు ముందుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జ్యోతి, స్టూడెంట్ కౌన్సిలర్స్ కుమార్, రజిత, అధ్యాపకులు కవిత, శారద, చంద్రశేఖర్, కుమారస్వామి, శోభాదేవి, యామిని, సురేందర్‌రెడ్డి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వేలేరు విద్యార్థులు

వేలేరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సత్తయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 69వ స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ములుగు జిల్లా జాకారంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్ 14 బాల, బాలికల విభాగంలో వేలేరు పాఠశాల విద్యార్థులు రోహన్‌తేజ్, నందిని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. నేటి నుంచి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వరంగల్ జిల్లా తరుపున పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. కాగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ సునీల్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. క్రీడల్లో రాణించి మంచి గుర్తింపు పొందాలని కోరారు.

వ్యవసాయంలో మహిళల పాత్ర గొప్పది

- వ్యవసాయ కళాశాల అధ్యాపకులు


మహిళా రైతును సన్మానిస్తున్న అధ్యాపకులు

దామెర : వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర గొప్పదని వరంగల్ వ్యవసాయ కళాశాల అధ్యాపకులు అన్నారు. అంతర్జాతీయ మహిళా రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని పులుకుర్తి రైతు వేదికలో మహిళా రైతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా మహిళలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారని అన్నారు. అనంతరం పెరటి తోటలో కూరగాయల పెంపకం, సేంద్రియ వ్యవసాయం గురించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రాంబాబు, నరేందర్, గోపిక, శ్రీనివాస్‌నాయక్, ఏఈఓ రామకృష్ణ, మహిళ రైతులు, రైతులు పాల్గొన్నారు.

రేపు యాగశాల సంప్రోక్షణ

పరకాల : కార్తీక మాస మహారుద్రయాగ మహోత్సవం సందర్భంగా శుక్రవారం (రేపు) ఉదయం 6గంటల 35 నిమిషాలకు పావమాన వేదమంత్రోచ్ఛరణలతో 108 కళశములో సకల నదీ, తీర్థ సంగ్రహణ సూర్వక యాగశాల సంప్రోక్షణ నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావు తెలిపారు. కార్తీక మాస మహారుద్ర యాగ సమితి సభ్యులు, అర్చకులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

'తహసీల్' ముట్టడికి తరలి రావాలి


మాట్లాడుతున్న రవీందర్

కమలాపూర్ : సుప్రీం కోర్టు సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి యత్నాన్ని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 17న నిర్వహించ తలపెట్టిన తహసీల్దార్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ శనిగరపు రవీందర్ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ రమేశ్ అధ్యక్షతన మండల కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి యావత్ భారతదేశంలో ఉన్న దళితులపై, భారత రాజ్యాంగం, భారత న్యాయ వ్యవస్థపై జరిగిన దాడి అన్నారు. రాకేశ్ కిశోర్ అనే న్యాయవాది కుల దురహంకారంతో, వ్యక్తిగత కక్షతో సీజేఐపై దాడికి యత్నించాడని ఆరోపించారు. పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఈనెల 17న తహసీల్దార్ కార్యాలయ ముట్టడికి పార్టీలు, సంఘాలకు అతీతంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మేధావులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి


అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నడికూడ : మండలంలోని పులిగిల్ల ప్రాథమిక ఉన్నత పాఠశాల, చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు సతీశ్, ఉపాధ్యాయులు ఉమా, ప్రదీప్, నిరోష, రమేశ్, దేవా, రాజుకుమార్, రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరి, సూరమ్మ, లక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.

దేవాదుల కెనాల్ టెండర్లలో అక్రమాలు

- కాంట్రాక్టర్‌తో అధికారుల కుమ్మక్కు..?


ఇటీవల కురిసిన వర్షానికి గండి పడిన దేవాదుల కాల్వ (ఫైల్)

ఎల్కతుర్తి : దేవాదుల నీటి సరఫరా విభాగంలో టెండర్ ప్రక్రియపై అవినీతి జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల భీమదేవరపల్లి మండలంలోని విశ్వనాథ కాలనీలో కురిసిన భారీ వర్షాల కారణంగా ధ్వంసమైన దేవాదుల నార్త్ కెనాల్ మరమ్మతు పనులకై చేపట్టిన టెండర్‌లో అధికారుల తీరు వివాదస్పదంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాల్వ మరమ్మతు పనులకు సంబంధించిన టెండర్లు ఓపెన్ ప్రక్రియలో నిర్వహించకపోవడం, స్థానికులకు అవకాశం ఇవ్వకుండా అధికారుల సన్నిహితులకే కాంట్రాక్టు కట్టబెట్టారని ఆరోపనలు వినిపిస్తున్నాయి. ఈ టెండర్‌ను హుజూరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించడంలో ఓ అధికారి కీలకపాత్ర పోషించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. హనుమకొండ జిల్లాలోని పనులు కరీంనగర్ జిల్లాకు చెందిన కాంట్రాక్టర్‌కు అప్పగించడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాల్సిన సమయంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆలస్యమవుతుందని రైతులు మండిపడుతున్నారు. టెండర్ ప్రక్రియపై ఉన్నతాధికారులు దృష్టిసారించి తక్షణ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలి


ఆత్మకూరు : పోషకాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి


కమలాపూర్ : పోషణమాసంలో పాల్గొన్న గర్భిణులు, తల్లులు

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : పోషకాహారంపై మహిళలు అవగాహన పెంచుకోవాలని, మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గర్భిణీ స్త్రీల పోషణ స్థితిని మెరుగుపరిస్తే భావితరాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. మహిళలు, గర్భిణీలు, బాలింతలు, పిల్లల ఆహారం, ఆరోగ్యంపై ఐసీడీఎస్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, మండల వైద్యాధికారిణి డాక్టర్ స్పందన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉమ, సునీత, పద్మావతి, పుణ్యవతి, నజీమా పర్వీన్, శ్రీదేవి, రోజారాణి, అంగన్‌వాడీ టీచర్లు, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ భిక్షపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : పోషకాహారంతోనే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ భీమదేవరపల్లి సీడీపీఓ స్వరూప అన్నారు. పోషణ మాసంలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం సామూహిక సీమంతాలు చేపట్టారు. ఈ సందర్భంగా 15 మంది గర్భిణులకు సీమంతాలు చేసి చీర, గాజులు, పండ్లు, పూలు, మిఠాయిలు అందించారు. గర్భిణులు కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు అన్ని రకాలుగా అధిక పోషకాలు ఉన్న మంచి ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఎంపీడీఓ గుండె బాబు, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రేణుక, రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, శ్రీలత, పద్మకుమారి, ఉమాదేవి, తిరుమల, పూర్ణిమ, రజిత, అనిత, అంకూస్‌బీ, రాణి, కవిత, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకోవాలి

శాయంపేట : ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకోవాలని టీజీరెడ్‌కో జిల్లా మేనేజర్ గంగుల మహేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల వినియోగం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సౌర విద్యుత్‌ను ప్రోత్సహిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ మఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా రూఫ్‌టాప్ సోలార్‌ను అందిస్తున్నట్లు చెప్పారు. గృహ విద్యుత్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందని, 1 కిలోవాటుకు రూ.30వేలు, 2కిలో వాటుకు రూ.60వేలు, 3 కిలోవాటుకు రూ.78వేలు రాయితీ కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీజీరెడ్‌కో ఫీల్డ్ ఆఫీసర్ దీపక్, డీపీఎంలు దయాకర్, అనిత, పద్మప్రియ, ఏపీఎం వేణుగోపాల్‌రావు, సీసీలు విజయ్‌కుమార్, అనూష, మంజుల, శ్రీనివాసారావు, వీఓఏలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

బీసీల రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలి

పరకాల : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు బీసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన నిర్వహించతలపెట్టిన రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, విద్యావేత్త డాక్టర్ సిరికొండ శ్రీనివాసచారి పిలుపునిచ్చారు. బుధవారం పరకాలలో జరిగిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీ.ఓ 9కి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. రిజర్వేషన్ల బిల్లును షెడ్యూల్డ్ 9లో చేర్చాలని అందుకోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

శాయంపేట : మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై వెంటనే విచారణ చేపట్టాలని కార్మిక సంఘం నాయకులు దాసరి సమ్మయ్య, ఆకునూరి జనార్దన్ డిమాండ్ చేశారు. వేతనాలు ఇవ్వాలని చేనేత కార్మికులు సొసైటీ ఎదుటు రెండోరోజు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 2 నెలల 15 రోజులుగా చేనేత కార్మికులకు వేతనాలు ఇవ్వడంలేదని, సొసైటీ పాలకవర్గ సభ్యులను అడిగితే ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. నేత కార్మికులకు గిట్టుబాటు కూలి ఇవ్వడం లేదని ఆరోపించారు. చేనేత సహకార సంఘానికి ప్రభుత్వం నుంచి అనేక నిధులు వచ్చాయని వాటిని దుర్వినియోగ పర్చారని వెంటనే జిల్లాస్థాయి అధికారులతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంతో విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ జరిపించేందుకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తమకు వేతనాలు అందించి న్యాయం చేయాలని కోరారు.

జగదీశ్వర్‌కు పదోన్నతి

దామెర : దామెర ఏఈఓ జగదీశ్వర్ ఏఓగా పదోన్నతి పొందారు. ఈ మేరకు వరంగల్ ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ల్యాబోరేటరీకి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పీఆర్సీ ప్రకటించాలి

ఎల్కతుర్తి : పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నేబోయిన తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ భీమదేవరపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో కొత్తపల్లి, ముల్కనూరు, ముత్తారం, కొత్తకొండ, గట్లనర్సింగాపూర్, మల్లారం, ముస్తాఫాపూర్ పాఠశాలల్లోని ఉపాధ్యాయుతో ఆయన సమావేశమై మాట్లాడారు. రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం పీఆర్‌సీపై నిర్ణయం తీసుకోకపోవడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ప్రతినెల రూ.700కోట్లు విడుదల చేసి పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించి టైం స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. చందుపట్ల రాజేందర్, లక్ష్మయ్య, ప్రతాప్, అనీల్ పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ

దామెర : పులుకుర్తి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ఇంజనీరు గద్దె నర్సయ్య 60 మంది విద్యార్థులకు టై, బెల్టులను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు తనవంతు సాయం చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు చదువులో రాణించాలని సూచించారు.